

కేజీబీవీల్లో నూతన మెనూ
కేజీబీవీల్లో బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మెనూలో పలు మార్పులు చేసింది. 8లో▸



ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ
జిల్లాలోని వివిధ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అధికారులు, నాయకులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /26.0

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉపకరణాల దరఖాస్తు గడువు పొడిగించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగుల సహాయ ఉపకరణాల దరఖాస్తు గడువు ఈనెల 30 వరకు పొడిగించాలని కోరుతూ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సట్టి సాయన్న బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపకరణాలకోసం ఈనెల 7 నుండి 18 వరకు కేవలం 11 రోజులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడానికి మారుమూల ప్రాంత దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముత్యం, నాయకులు సముద్రాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు హక్కుల రక్షణకు ఉద్యమించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీడీ కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: కార్మికులు హక్కుల రక్షణకోసం ఉద్యమించాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీడీ ఫ్యాక్టరీలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో నిజామాబాద్‌లో నిర్వహించనున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలతో 44 చట్టాలను నాలుగు కోడ్స్‌గా మార్చి యాజమాన్యాలకు అనుకూలమైన చట్టాలు చేయడం అన్యాయమన్నారు. బీడీ పరిశ్రమపై విధించిన 28 శాతం జీఎస్టీ తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్, పోశెట్టి, రాజేందర్, లక్ష్మణ్, రాజు, మురళి, నరసయ్య, గంగామణి, లక్ష్మి, విజయ, కమల, కవిత, అరుణ, శ్రీనివాస్, చిన్నయ్య, ఉత్తమ్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ టు మహోర్ ఆర్టీసీ బస్సు ప్రారంభం

నిర్మల్‌టౌన్: నిర్మల్ నుంచి పవిత్ర క్షేత్రాలైన రేణుకామాత, దత్తాత్రేయ, అనసూయ మాత దేవాలయాలున్న మహారాష్ట్రలోని మహోర్ వరకు ఆర్టీసీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కే.పండరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ నుంచి ఉదయం 6:20 నిమిషాలకు బయలుదేరి 10:20 నిమిషాలకు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి 11 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు నిర్మల్ చేరుకుంటుందన్నారు. మరోబస్సు మధ్యాహ్నం 12:50 నిమిషాలకు నిర్మల్ నుంచి బయలుదేరి సాయంత్రం 4:50 నిమిషాలకు మహోర్ చేరుకుని అక్కడి నుంచి సాయంత్రం 5 గంటలకు బయలుదేరి రాత్రి 9 గంటలకు నిర్మల్ చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ బస్సులో మహిళలకు తెలంగాణ బార్డర్ వరకు ఆధార్‌కార్డుపై ఉచిత ప్రయాణం వర్తిస్తుందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

సారంగపూర్: కౌలురైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. మండలంలోని ఆలూరులో సర్వే నిర్వహించి కౌలురైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో కౌలు రైతుల అధీకృత సాగుదారుల చట్టం తెచ్చిందని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న రేవంత్‌రెడ్డి సర్కారు కౌలురైతుల చట్టాన్ని నిర్వీర్యం చేస్తుండడంతో పంటనష్టం జరిగితే కనీసం పరిహారం కూడా అందని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి కౌలురైతుల చట్టాన్ని తీసుకుని వచ్చి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక సభ్యులు రమాకాంత్, రాకేశ్, షారూఖ్, శివాకర్, శ్రీనివాస్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సాగులో సవాళ్లు..!

- వరి ధాన్యం మద్దతు ధర రూ.69 పెంచిన కేంద్రం
- పచ్చిరొట్ట ఎరువుల సబ్సిడీ 10 శాతం తగ్గించిన రాష్ట్రం
- దొడ్డు రకం వడ్లకు ఇప్పటికీ బోనస్ లేదు
- సన్న వడ్లు దిగుబడి రాదు..
- అవసరానికి అందని రైతు భరోసా



దుక్కిదున్ని సిద్ధంగా ఉంచిన పంట పొలాలు

భైంసా : జిల్లాలో గోదావరి నది తీరంలో వరి పంట ప్రధాన వ్యవసాయంగా కొనసాగుతోంది. 53 కిలోమీటర్ల మేర గోదావరి పరీవాహక ప్రాంతంలో దాదాపు 70 వేల ఎకరాలకుపైగా వరి సాగవుతుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద 18 లక్షల ఎకరాల్లో సింహభాగం వరి పంటే ఉంది. అయితే, భారీ వర్షాలతో నది ఉప్పొంగి పంట నష్టం జరుగుతుందన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. దీంతోపాటు, తక్కువ మద్దతు ధర, సబ్సిడీల తగ్గింపు, దొడ్డు రకం వరికి బోనస్ లేకపోవడం, పంటల బీమా అమలు చేయకపోవడం వంటి సమస్యలు రైతులను కలవరపెడుతున్నాయి.

సబ్సిడీ తగ్గింపుతో భారం..
సాగులో భూమి సారవంతం కోసం రైతులు జీలుగులు, జనుము వంటి పచ్చిరొట్ట ఎరువులను వినియోగిస్తారు. గతేడాది 60 శాతం సబ్సిడీతో 30 కేజీల జీలుగు బస్తా రూ.1,116, 40 కేజీల జనుము బస్తా రూ.1,448కి అందుబాటులో ఉండేవి. ఈ ఏడాది సబ్సిడీని 50 శాతానికి తగ్గించడంతో 30 కేజీల జీలుగుబస్తా రూ.2,138, 40 కేజీల జనుము బస్తా రూ.2,510కి పెరిగింది. ఈ ధరల పెంపుతో రైతులు పచ్చిరొట్ట ఎరువులు కొనలేక, ప్రైవేటు దుకాణాల్లో పెసర బ్యాగులు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

దొడ్డు వడ్లకు ఇవ్వని బోనస్..
నిర్మల్ జిల్లాలో వరి సాగులో 60 శాతం రైతులు దొడ్డు రకం వరిని పండిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నప్పటికీ, దొడ్డు రకానికి ఈ సౌకర్యం లేదు. సన్నరకం వరి సాగు చేసే రైతులు చీడపీడల నివారణకు ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉండగా, ఎకరానికి 14 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. అయితే, దొడ్డు రకం వరి ఎకరానికి 25 క్వింటాళ్లకు పైగా దిగుబడినిస్తుంది. అయినా దొడ్డు రకానికి బోనస్ లేకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్కువ మద్దతు ధర, సబ్సిడీల తగ్గింపు, దొడ్డు రకం వరికి బోనస్ లేకపోవడం వంటి సమస్యలు రైతుల ఆర్థికస్థితిని దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వం వరి రైతులకు న్యాయమైన మద్దతు ధర, సబ్సిడీలు, బోనస్ సౌకర్యాలను అందించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

రైతు భరోసా ఆలస్యం
ఇక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అందించే పెట్టుబడి సాయం ఆలస్యం అవుతోంది. మొదటి ఏడాది చాలా మందికి రైతుభరోసా ఇవ్వలేదు. గత యాసంగిలో కూడా ఐదెకరాల లోపు మాత్రమే రైతుభరోసా చెల్లించింది. అదీ ఆలస్యమైంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి కోసం మళ్లీ అప్పుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

మద్దతు ధర నామమాత్రం పెంపు
కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది వరి ధాన్యం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ని గతేడాదితో పోలిస్తే కేవలం మూడుశాతం మాత్రమే పెంచింది. సాధారణ వరిధాన్యం క్వింటాల్‌కు రూ.2,369, ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2,389గా నిర్ణయించింది, ఇది గత ఏడాదితో పోలిస్తే కేవలం రూ.69 పెరుగుదల మాత్రమే. ఇతర పంటలతో పోలిస్తే వరి ధర పెంపు అత్యంత తక్కువగా ఉందని రైతులు పెదవి విరుస్తున్నారు. మినుములపై రూ.400, కందులపై రూ.450, జొన్నపై రూ.328, మొక్కజొన్నపై రూ.175, సజ్జలపై రూ.150, రాగులపై రూ.579, వేరుశెనగపై రూ.480, సోయాబీన్‌పై రూ.436, పొద్దుతిరుగుడుపై రూ.441, పత్తిపై రూ.589, ఒలిసెలపై రూ.820 పెంచినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికల సమయంలో బీజేపీ వరిధాన్యం క్వింటాల్‌కు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ, తక్కువ పెంపుతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు
వరి రైతులకు ఈయేడు కూడా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నాం. 30 కేజీల జీలుగు సంచి 50 శాతం సబ్సిడీతో రూ.2,138 చెల్లించి తీసుకెళ్లాలి. 40 కేజీల జనుము సంచి 50 శాతం సబ్సిడీతో రూ.2,510 చెల్లించి తీసుకెళ్లాలి. 30 కేజీల పచ్చిరొట్ట విత్తనాలు రెండున్నర ఎకరాలకు సరిపోతాయి.
– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

పెసర వేస్తున్నాం
పచ్చిరొట్ల విత్తనాల ధరలు విపరీతంగా పెరిగాయి. ఏటా జీలుగు, జనుము చల్లేవాళ్లం. ఈ ఏడాది 30 కిలోల బస్తా రూ.2,138 చెల్లించాల్సి వస్తోంది. అంత మొత్తం పెట్టి ఏ రైతు కొనలేడు.
– కొండ శ్రీనివాస్, న్యూపోచంపాడ్

మద్దతు ధర పెరగలేదు
కేంద్ర ప్రభుత్వం వరి పంట మద్దతు ధర అంతగా పెంచలేదు. క్వింటాలుకు రూ.69 మాత్రమే పెంచింది. దీంతో రైతులు నష్టాలపాలవుతారు. పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నా మద్దతు ధర అంతగా పెరగడంలేదు.
– సుంకరి దత్తు, ఇలేగాం

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి
రాష్ట్ర ప్రభుత్వం దొడ్డురకం వరిధాన్యానికి బోనస్ ఇవ్వాలి. సన్నాలకు క్వింటాలుకు రూ.500 చెల్లిస్తుంది. అయినా సన్నాల సాగుకు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దిగుబడి తగ్గిపోతుంది. వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.
– రఘునాథ్, వాలేగాం

వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వర్షాలు, వరదల వల్ల ప్రజలు ప్రాణాలు, ఆస్తులు కోల్పోకుండా అన్ని శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లడ్ మాన్యువల్‌పై సంబంధిత శాఖల అధికారులతో జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల నిర్వహణ కేవలం స్పందనకే పరిమితం కాకుండా, ప్రమాద నివారణ, తీవ్రత తగ్గింపు, పునరావాసం, పునర్నిర్మాణం దశల్లో ముందస్తుగా ప్రణాళికలు ఉండాలన్నారు. వర్షాకాలానికి ముందు నదులు, వాగులు, కుంటలలో నీటి ప్రవాహ మార్గాలను శుభ్రం చేయాలని, పట్టణాల్లో డ్రెయినేజీ వ్యవస్థను పర్యవేక్షించాలని, పాడైన రహదారులను తక్షణమే మరమ్మతు చేయాలని సూచించారు. రిజర్వాయర్ల గేట్ల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కడెం, స్వర్ణ, గడ్డెన్న ప్రాజెక్టులు, గోదావరి పరీవాహక గ్రామాల్లో నివసించే ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టుల నీటిమట్టాలను నిరంతరం గమనిస్తూ దిగువ గ్రామాలకు సమాచారం అందించాలని, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో ఉన్న బ్రిడ్జిలు, రహదారులను గుర్తించి మరమ్మతులు చేపట్టాలన్నారు. వైద్యులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల సమయంలో పశువులను మేతకు తీసుకెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలాల వారీగా వరద ప్రభావిత ప్రాంతాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి, ఆర్డీవో రత్నాకళ్యాణి, రెవెన్యూ, విద్యుత్, ఫైర్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు బాసటగా రైతు భరోసా
నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం రైతులకు బాసటగా నిలుస్తోందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. వానాకాలం 2025 సీజన్‌కు సంబంధించి జిల్లాలో 1,86,400 మంది రైతులకుగానూ మంగళవారం నాటికి డీబీటీ ద్వారా 1,33,135 మందికి రూ.112.86 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి త్వరలోనే నిధులు జమ కాబోతున్నట్లు తెలిపారు. ఎన్ని ఎకరాలున్నా పెట్టుబడి సాయం అందేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

పంట రుణాలు మంజూరు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వ్యవసాయ, మత్స్య, గ్రామీణ, పట్టణ ఉపాధి రంగాల అభివృద్ధికి బ్యాంకులు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్‌డీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు పంట రుణాలను సకాలంలో మంజూరు చేయాలన్నారు. పంటల బీమా అమలుపై సానుకూల దృష్టితో ముందుకు సాగాలన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం ఈజీపీ, డెయిరీ యూనిట్లు, మత్స్యకారుల రుణాలు, ఎస్‌హెచ్‌జీ మహిళల వ్యక్తిగత, సంఘాల రుణాలు, ముద్ర, రాజీవ్ యువ కిరణల వంటి పథకాల అమలులో బ్యాంకులు సానుకూలంగా వ్యవహరించాలన్నారు. మహిళా శక్తి క్యాంటిన్ వంటి పథకాల్లో బ్యాంకులు భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి వార్షిక రుణప్రణాళిక 2025–26 విడుదల చేశారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి రూ.4,70,674.3 లక్షలు, విద్య, గృహ, ఆరోగ్య రంగాలకు రూ.1,13,257.99 లక్షలు రుణంగా పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. పశుపోషణ, కోల్డ్‌స్టోరేజీ, పంటల నిల్వ వంటి వ్యవసాయ ఆధారిత రంగాలకు, మహిళా సంఘాలకు ప్రత్యేక రుణ ప్రోత్సాహకాలు, ఎంఎస్ఎంఈలకు నిధుల సమకూర్పుతో పాటు స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వనున్నట్లు వివరించారు. సమావేశంలో నిర్మల్, ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఎల్‌డీఎం రాంగోపాల్, బ్యాంకుల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తా

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



జామ్‌-బోరింగ్‌తండా రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జామ్ నుంచి బోరింగ్ తండా వరకు రూ.3.20 కోట్లతో నిర్మించిన రహదారిని ప్రారంభించారు. అనంతరం సారంగాపూర్, బీరవెల్లిలో లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు వేగంగా పనులు చేపడితే నేరుగా వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆందోళన
మండలంలోని దుర్గానగర్‌కు రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పీఆర్ డీఈఈ తుకారాం, ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. గురువారం పనులు ప్రారంభమవుతాయని, కానిపక్షంలో అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ వ్వడంతో తండావాసులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు గంగారెడ్డి, తక్కల రమణారెడ్డి, రాజేందర్ రెడ్డి, విలాస్, తిరుమలాచారి, నారాయణ, కొరిపెల్లి రాజు, ఆర్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ
నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని బంగల్‌పేట్ కాలనీలో రూ.10 లక్షల నిధులతో చేపట్టిన ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదిరాజ్‌ల అభ్యున్నతికి పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు మెడిసెమ్మ రాజు, పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి, నాయకులు పాతర్ల గణేశ్, ఆనంద్, పాతర్ల హరీష్, యాటకారి సాయన్న, పాతర్ల వెంకటి, పరమేశ్, దేవిదాస్, జింక సూరి, జుట్టు దినేష్, గిల్లి విజయ్, గవాస్కర్, చరణ్ మౌర్య, మున్సిపల్ అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు చట్టపరంగా పరిష్కరించాలి

- ఎస్పీ జానకీ షర్మిల



వృద్ధ దంపతులను ఓదారుస్తున్న ఎస్పీ

భైంసాటౌన్: అర్జీదారుల ఫిర్యాదులను చట్టపరంగా పరిష్కరించాలని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భైంసా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్‌లో సూచనలు చేశారు. అనంతరం భరోసా కేంద్రంలో షీ టీమ్ సిబ్బందితో కుటుంబ కలహాల కేసుల్లో ఇరు పార్టీల వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఓ వృద్ధ దంపతులు తమ కొడుకు, కోడలు ఇంటి నుంచి వెళ్లగొట్టారని ఎస్పీని కలిసి మొరపెట్టుకున్నారు. దీంతో స్పందించిన ఎస్పీ న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐలు గోపినాథ్, నైలు, మల్లేశ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలి
భైంసాటౌన్: వర్షాకాలం నేపథ్యంలో వరదలు వంటి ప్రకృతి విపత్తులు సంభవిస్తే సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. బుధవారం డీఆర్‌డీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ వద్ద నిర్వహించిన మాక్‌డ్రిల్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఎఫ్ సిబ్బంది విపత్తుల సమయంలో ప్రజలను ఎలా కాపాడాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐ గోపినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు అక్షర జ్ఞానం

- 'ఉల్లాస్'తో అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పథకం అమలు
- నిరక్షరాస్యులను గుర్తించే పనిలో డీఆర్డీవో సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

జిల్లా వివరాలు	మండలాలు 18	
స్వయం సహాయక సంఘాలు 12,215	మొత్తం సభ్యులు 1,34,002	గ్రామైక్య సంఘాలు 505

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం మహిళా సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యంతో 'ఉల్లాస్' పథకాన్ని అమలు చేస్తోంది. దేశంలోని ప్రతీ మహిళ అక్షర జ్ఞానం పొందాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాశాఖ, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. దశలవారీగా అమలయ్యే ఈ పథకం ద్వారా నిరక్షరాస్యులను గుర్తించి, వారికి చదవడం, రాయడం నేర్పడంతోపాటు, మధ్యలో చదువు మానేసిన వారిని ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఓపెన్ డిగ్రీ వరకు చదివించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

డీఆర్డీవో, విద్యాశాఖ సమన్వయం
ఉల్లాస్ కార్యక్రమం సజావుగా అమలు కావడానికి డీఆర్డీవో, విద్యాశాఖ అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీ ఏర్పాటవుతుంది. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంఈవో, ఐకేపీ ఏపీఎం, గ్రామ స్థాయిలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, వీఏవో, సంఘాల అధ్యక్షురాళ్లు, కార్యదర్శులు బాధ్యతలు నిర్వహిస్తారు. నిరక్షరాస్యులను గుర్తించేందుకు ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. సర్వే వివరాలను ఈ యాప్‌లో నమోదు చేస్తారు. చదువు మధ్యలో మానేసిన వారిని ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివేలా ప్రోత్సహిస్తారు. సంఘాల్లో చదువుకునేవారు లేకుంటే సభ్యుల పిల్లలతో కార్యక్రమాన్ని కొనసాగిస్తారు. సర్వే పూర్తయిన వెంటనే వాలంటీర్ల సాయంతో కార్యక్రమం ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

18 ఏళ్లు నిండిన సభ్యులపై దృష్టి
ఈ పథకం ప్రధానంగా 18 ఏళ్లు నిండిన మహిళా సంఘ సభ్యులపై దృష్టి సారిస్తుంది. జిల్లా స్థాయిలో డీఆర్డీవో, విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే ప్రారంభించారు. ఇప్పటి వరకు 31,323 మంది నిరక్షరాస్య మహిళలను గుర్తించారు. సంఘాల్లో అక్షరాస్యులైన సభ్యులను వాలంటీర్లుగా నియమించి, నిరక్షరాస్యులకు అక్షర జ్ఞానం నేర్పిస్తారు. ఐదుగురు నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్‌ను కేటాయిస్తారు. గ్రామ స్థాయిలో సర్వే పూర్తి చేసి, నిరక్షరాస్యుల సంఖ్యను ఖరారు చేస్తారు.

సామాజిక సాధికారత
ఉల్లాస్ పథకం ద్వారా చదవడం, రాయడం నేర్పడం ద్వారా సామాజిక సాధికారత సాధించడమే ప్రధాన లక్ష్యం. అధికారిక సమాచారం ప్రకారం, మహిళా సంఘాల్లో 50 శాతం మంది మాత్రమే సంతకం చేయగలరు, మిగిలిన వారు వేలిముద్రలు వేస్తున్నారు. ఈ పథకం ద్వారా అందరికీ చదవడం, రాయడం నేర్పడంతోపాటు, మధ్యలో చదువు మానేసిన వారిని ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, డిగ్రీ వరకు చదివించనున్నారు. అదనంగా, స్కిల్ డెవలప్‌మెంట్, టెక్నికల్ కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. బ్యాంకింగ్‌లో ఆర్థిక క్రమశిక్షణ, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై కూడా అవగాహన కల్పిస్తారు.

వలంటీర్లుగా అక్షరాస్యులు
డీఆర్డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో నిరక్షరాస్యులను గుర్తించిన తర్వాత, 15–20 మందితో గ్రూపులను ఏర్పాటు చేస్తారు. మహిళా సంఘాల్లోని అక్షరాస్య మహిళలను వలంటీర్లుగా ఎంపిక చేసి, నిరక్షరాస్యులకు చదువు నేర్పే బాధ్యత అప్పగిస్తారు. వీరు ఎలాంటి పారితోషికం లేకుండా సేవాభావంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. విద్యాశాఖ నుంచి పుస్తకాలు, గ్రామస్థాయి ఉపాధ్యాయుల సహకారంతో ఈ పథకం విజయవంతం కానుంది.

అవగాహన కల్పిస్తున్నాం..
2030 నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి అక్షరాస్యత సాధించే దిశగా ఉల్లాస్ కార్యక్రమాన్ని చేపట్టాయి. మహిళా సంఘంలోని నిరక్షరాస్యులకు చదువు చెప్పేందుకు కార్యాచరణ రూపొందించాం. విద్యాశాఖ అధికారులు, డీఆర్డీవో ఆధ్వర్యంలో సమష్టిగా ముందుకు సాగి లక్ష్యాన్ని చేరుకుంటాం.
– తిరుపతిరావు, సహాయ ప్రాజెక్టు అధికారి

భవన నిర్మాణం ఆపాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న మాదిగ సంఘం సభ్యులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఎస్సీ కుల(మాల) సంఘ భవన నిర్మాణం పనులు నిలిపివేయాలని కోరుతూ మాదిగ సంఘం సభ్యులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. గతంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్‌వారి మడిగెలు(రూములు) ఉండేవని, ఇటీవల అనుమతి లేకుండా ఎస్సీ మాల సంఘం సభ్యులు కూలగొట్టి అక్కడ మాల సంఘ భవనం నిర్మాణం పనులు చేపడుతున్నారన్నారు. నిర్మాణ పనులు నిలిపి వేసి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధకు వినతిపత్రం అందజేశారు.

క్లుప్తంగా

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి శివారులో బుధవారం ప్రాణహిత నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న పెద్దింటి రాజు, మానిశెట్టి ప్రశాంత్ అనే వ్యక్తులను పట్టుకుని ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ప్రాణహిత నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ దస్తగిరి ఉన్నారు.

విద్యార్థినులను వేధించిన యువకుడిపై కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ విద్యార్థినులను వేధించిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి ఎస్సై హైమా బుధవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మెడికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు కళాశాలకు వెళ్లి వచ్చేటప్పుడు కాలేజ్‌రోడ్డులోని ఓ చికెన్ సెంటర్‌లో పని చేసే యువకుడు తన ప్రైవేటు భాగాలు చూపిస్తూ వేధిస్తున్నాడని అందిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

గొలుసు చోరీకి విఫలయత్నం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో బుధవారం ఓ మహిళ గొలుసు దొంగతనానికి విఫలయత్నం చేసింది. పట్టణ ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. బోరిగాం గ్రామానికి చెందిన సాయవ్వ పిల్లల స్కూల్ ఫీజు కట్టేందుకు నిర్మల్‌కు వచ్చింది. తిరిగి వెళ్లే క్రమంలో బస్టాండ్ ప్రాంతంలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు ఆగింది. ఆ సమయంలో గంగామణి అనే మహిళ సాయవ్వ మెడలోని బంగారు గొలుసు చోరీ చేసేందుకు యత్నించింది. వెంటనే సాయవ్వ దొంగా అని అరవడంతో.. స్థానికులు గంగామణిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్కూల్ బస్సు డ్రైవర్‌పై యువకుల దాడి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్‌పై నలుగురు యువకులు దాడి చేసినట్లు సీఐ ప్రమోద్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుధవారం స్కూల్ బస్సు డ్రైవర్ చిప్పకుర్తి శ్రీనివాస్ ముల్కల్ల వైపు నుంచి మంచిర్యాలకు వస్తుండగా వెనుక నుంచి మద్యం మత్తులో నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై వచ్చి ఓవర్ టేక్ చేసి స్థానిక ఐబీ చౌరస్తాలో బస్సుకు అడ్డంగా వాహనాలు నిలిపారు. బస్సు డ్రైవర్ శ్రీనును కిందకు దించి చితకబాదారు. ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ఆపేందుకు ప్రయత్నించగా దురుసుగా ప్రవర్తించారు. ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. బస్సు డ్రైవర్ శ్రీను ఫిర్యాదు మేరకు కాలేజిరోడ్‌కు చెందిన కరవేణి మనోజ్, మత్తునూరి వినయ్, మేకల వెంకటసాయి, ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన మామిడిపల్లి చందులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

లక్సెట్టిపేట: విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దండెపల్లి, జన్నారం మండలాల నుంచి వచ్చిన 12 దరఖాస్తులు స్వీకరించారు.



కేజీబీవీల్లో నూతన మెనూ

- పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- విద్యార్థినులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు
- పెరిగిన మెస్‌చార్జీలతో విద్యార్థినుల హర్షం



సోన్ కేజీబీవీ భవనం

లక్ష్మణచాంద: నిరుపేద బాలికలు మధ్యలో చదువు ఆపేయకుండా, వారిని అక్కున చేర్చుకుని కేజీబీవీలు వసతితో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నాయి. కేజీబీవీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. కేజీబీవీ విద్యార్థినులు పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్నట్లు ఇటీవల చేపట్టిన సర్వేలో తేలింది. దీంతో కేజీబీవీ బాలికల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న బాలికలకు పౌష్టికాహారం అందించి వారిని అనారోగ్య సమస్యల నుంచి దూరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గతంలో ఉన్న మెనూలో పలు మార్పులు చేసింది. దీంతో 2025 -26 విద్యా సంవత్సరంలో నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించనున్నారు.

పెరిగిన మెస్ చార్జీలు

గతంలో 6 -10, ఇంటర్ విద్యార్థులందరికీ ఒకే విధంగా నెలకు రూ.1225లు ప్రభుత్వం అందించేది. కానీ నేడు నూతన మెనూ ప్రకారం 6 నుంచి 7వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.1330లు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.1540లు, ఇంటర్ విద్యార్థులకు నెలకు రూ.2100లు అందించనున్నారు.

ఉమ్మడి జిల్లా కేజీబీవీల సమాచారం..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	ఇంటర్ కాలేజీలు	విద్యార్థుల సంఖ్య	మొత్తం
నిర్మల్	18	3600	14	2240	5840
మంచిర్యాల	18	3786	15	1080	4866
ఆదిలాబాద్	18	4800	13	680	5480
కుమురంభీం	15	3027	13	1069	4096

నూతన మెనూ ఇదే..

ఉదయం.. టమాట కిచిడి, సాంబారు, బూస్టు, పూరి, రాగి జావ, ఉప్మా, పులిహోర, వడ, బోండా, చపాతి, జీరా రైస్‌తో పాటు రోజుకు ఒక్కో రకమైన పండ్లు అందించాలి. ఇందులో అరటి పండు, జామ, వాటర్ మిలన్, బొప్పాయి, సపోట వంటి పండ్లు అందించాలి.

మధ్యాహ్నం.. టమాట పప్పుతో కూడిన అన్నం, నెయ్యి, రసం, పెరుగు, ఉడక బెట్టిన గుడ్డు, చికెన్ అందించాలి.

సాయంత్రం.. ఉడకబెట్టిన శనగలు, కోడిగుడ్డు బజ్జీ, బెల్లం పల్లీలు, అల్లం చాయ్, మిల్లెట్ బిస్కెట్లు, పకోడి ఇవ్వాలి.

రాత్రి వేళ.. వివిధ రకాల కూరలతో తయారు చేసిన అన్నం, సాంబారు, మజ్జిగ అందించాలి. నెలలో రెండు సార్లు మటన్, అయిదుసార్లు గుడ్లు, ప్రతీరోజు నెయ్యి అందించాలి.

సంతోషంగా ఉంది



కేజీబీవీ బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం నూతన మెనూ అమలు చేయడం సంతోషంగా ఉంది. మెస్ చార్జీలు కూడా పెంచడంతో మాకు ఎంతో ఉపశమనం కలుగుతుంది.

– ప్రసన్న, 10వ తరగతి విద్యార్థిని, కేజీబీవీ, లక్ష్మణచాంద

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



గతానికి భిన్నంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నూతన మెనూ అమలు చేయడం సంతోషంగా ఉంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మంచి పోషకాహారం అందడంతో చదువుపై మరింత దృష్టి సారిస్తాం.

– రిషిప్రియా, ఇంటర్, కేజీబీవీ, లక్ష్మణచాంద

నూతన మెనూ ప్రకారమే..



ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి నూతన మెనూ అమలు చేయాలని కేజీబీవీల ఎస్‌వోలకు సూచించాం. కొత్త మెనూ పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. నూతన మెనూ చార్టులు ఏర్పాటు చేయాలని సూచించాం.

– సలోమి కరుణ, సెక్టోరియల్ అధికారి, నిర్మల్

బస్సు ఢీకొని ఒకరి మృతి



ఘటనా స్థలంలో చంద్రశేఖర్ మృతదేహం

భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామానికి చెందిన బొడిగంవార్ చంద్రశేఖర్ (49) అనే వ్యక్తి దేగాం గ్రామంలో బస్సు ఢీకొట్టిన సంఘటనలో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాలేగాం గ్రామానికి చెందిన బొడిగంవార్ చంద్రశేఖర్ -సుశీల దంపతులు బుధవారం బాసరకు వెళ్తున్నారు. దేగాం బస్టాండ్ వద్ద బస్సు కోసం వేచిచూస్తున్న క్రమంలో చంద్రశేఖర్‌ను భైంసా నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు దేగాం చేరుకుని న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్సై

లారీ ఢీకొని ఒకరు..

భైంసాటౌన్: పట్టణంలోని సాత్‌పూల్ వంతెన సమీపంలో లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తానూర్ మండలం బెలతరోడకు చెందిన చెంచుల సాయినాథ్(37) బుధవారం బెల్‌తరోడ వెళ్లి బైక్‌పై భైంసా తిరిగి వస్తున్నాడు. సాత్‌పూల్ వంతెన వద్దకు చేరుకోగా, నిర్మల్ వైపు నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న సాయినాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఎండీ గౌసుద్దీన్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపినాథ్ తెలిపారు. సాయినాథ్‌కు భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.



సాయినాథ్ (ఫైల్)

ఇద్దరు వ్యక్తుల బైండోవర్

లక్సెట్టిపేట: మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన ధనిశెట్టి సతీశ్, కారుకూరి మల్లేశ్ అనే ఇద్దరు వ్యక్తులను స్థానిక తహసీల్దార్ దిలీప్ కుమార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ధనిశెట్టి సతీశ్, కారుకూరి మల్లేశ్ అనే వ్యక్తులు గత కొద్ది రోజుల నుంచి కారణం లేకుండానే 100 నంబర్‌కు డయల్ చేస్తున్నారు. పలుమార్లు ఈవిధంగా డయల్ చేస్తూ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారని, ఎలాంటి సమస్యలు లేకున్నా ఫోన్ చేస్తున్నందున బైండోవర్ చేసినట్లు తెలిపారు.



ఇద్దరు వ్యక్తులను బైండోవర్ చేసిన పోలీసులు

మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన బిల్ల దేవక్క(59) అనే వృద్ధురాలు అనారోగ్యం భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దేవక్క గత కొన్నేళ్లుగా బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి అనారోగ్యం సమస్యలతో బాధపడుతుంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం ఇంటి ఆవరణలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. దేవక్క కూతురు శ్రీవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కుంటలో దూకి యువకుడు..

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి గ్రామానికి చెందిన బన్సోడే కరణ్(25) అనే యువకుడు గ్రామ సమీపంలోని కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై శంకర్ తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం... కరణ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో తాత్కాలిక పద్ధతి న పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. గత కొ న్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన ఆయన ఈనెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికారు. బుధవారం స్థాని కులకు గ్రామ సమీపంలోని కుంటలో మృతదేహం కన్పించడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. కు టుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కూల్చివేతకు సిద్ధంగా కళాశాల భవనం




కొలతలు తీసుకుంటున్న ఇంజినీర్ అఖిలేష్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిథిలావస్థలో గల పురాతన భవనం కూల్చివేతకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు బుధవారం ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో చర్యలకు ఉపక్రమించారు. భవనం శిథిలావస్థకు చేరిందని కూలితే విద్యార్థులకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఇంజినీర్ అఖిలేష్‌తో కలిసి బుధవారం కూల్చివేత అనుమతుల కోసం కొలతలు తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వేలాది మంది విద్యార్థులు చదువుకున్న భవనం కూల్చివేస్తున్న విషయం తెలియగా పలువురు కలత చెందుతున్నారు. ఈ భవనాన్ని 1969లో నిర్మించినట్లుగా తెలుస్తోంది.

ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌కు కొణతం దిలీప్

ఖానాపూర్: గతంలో సోషల్‌మీడియాలో కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ సోషల్‌మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి కొణతం దిలీప్‌పై నమోదైన కేసులో భాగంగా బుధవారం ఆయన ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో హాజరయ్యారు. ఫిబ్రవరిలో నమోదైన కేసులో ఇది వరకే బెయిల్ మంజూరైనప్పటికీ ప్రతీ బుధవారం పోలీస్‌స్టేషన్‌కు హాజరు కావాల్సి ఉంది. ఈక్రమంలో పోలీసులు గంటల తరబడి ఆయన పోలీస్‌స్టేషన్‌లో నిరీక్షించేలా చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీస్‌స్టేషన్ బయట పెద్దఎత్తున గుమిగూడారు.

బెల్గాం అడవుల్లో ఎలుగుబంటి సంచారం



సంచరిస్తున్న ఎలుగుబంటి

కుభీర్: మండలంలోని బెల్గాం అడవుల్లో ఎలుగుబంటి సంచారంతో సమీప ప్రాంతాల వాసులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల క్రితం బెల్గాం గ్రామ శివారులోని చేనులో పని చేసే వారికి ఎలుగుబంటి కన్పించడంతో వారు భయంతో కేకలు వేయగా సమీప అడవిలోకి పారిపోయింది. మండలంలోని బ్రహ్మేశ్వర్, మార్లగొండ అడవుల్లో ఎలుగుబంట్లు ఉన్నట్లు సమాచారం ఉంది. ఎలుగుబంటి కనిపించిందన్న వార్త వ్యాపించడంతో అడవుల సమీపంలోని గ్రామాల ప్రజలు అడవివైపు వెళ్లడానికి జంకుతున్నారు. ఈ విషయమై అటవీ అధికారి లక్ష్మణ్‌ను బుధవారం వివరణ కోరగా ఐదు నుంచి ఆరు ఎలుగుబంట్లు ఉన్నాయని, అవి కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

తల్లి మెడలో గొలుసు అపహరించిన కుమారుడు

మందమర్రిరూరల్: తల్లి మెడలోని రెండు తులాల బంగారు గొలుసు దొంగిలించిన కుమారుడిని మందమర్రి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. బుధవారం మందమర్రి సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ హాజరై వివరాలు వెల్లడించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు వైపు నివాసం ఉండే విజయపురి పుల్లమ్మ అనే వృద్ధురాలు గత నెల 24న అనారోగ్యంతో బాధపడుతూ మంచం పట్టింది. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తి పుల్లమ్మ మెడలో గొలుసు దొంగిలించినట్లు మనుమడు శివ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉన్నతాధికారుల సూచనలు, సాంకేతికత ఆధారంగా ఇంటి వారే దొంగతనం చేసి ఉంటారనే కోణంలో పుల్లమ్మ కుమారుడు శంకరయ్యపై నిఘా ఉంచారు. ఆయన అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో విచారించగా ఆర్థిక ఇబ్బందుల వల్ల తానే దొంగిలించినట్లు నేరం అంగీకరించాడు. ఈ మేరకు శంకరయ్య వద్ద నుంచి రెండు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్న ఎస్సై రాజశేఖర్, క్రైంటీం కానిస్టేబుళ్లు మహేశ్, రాకేశ్‌లను ప్రత్యేకంగా అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

ఎస్సైపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

భీమారం: భీమారం ఎస్సై శ్వేత అక్రమ కేసులతో వేధిస్తున్నారని, ఆమెపై హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన బుక్యా రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులం పేరుతో దూషిస్తున్నారని, విచారణ లేకుండా కేసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ జరపాలని కమిషన్ రామగుండం సీపీకి లేఖ రాసినట్లు పేర్కొన్నారు. కాగా, ఈ విషయమై ఎస్సై శ్వేతను సంప్రదించగా.. రాజ్‌కుమార్ గ్రామంలో రౌడీయిజం, అక్రమ పనులు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో విచారణ చేస్తున్నామన్నారు. సహించలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

భూ వివాదంలో ఇరువర్గాల దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామ శివారులో జరిగిన భూ వివాదంలో ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. తాళ్లగురిజాల ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాతబెల్లంపల్లి గ్రామానికి చెందిన పనాస గణేశ్ ఆకెనపల్లి శివారు సర్వే నంబర్ 64లో ఉన్న భూమిని మంగళవారం సాయంత్రం దున్నే క్రమంలో పాతబెల్లంపల్లి గ్రామానికి చెందిన సింగతి హైమావతి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి రాళ్లతో పరస్పర దాడులకు దిగారు. దాడిలో పలువురికి గాయాలయ్యాయి. బాధితులను బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలకు చెందిన పది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూకబ్జాకు యత్నం.. ఆరుగురి రిమాండ్

- నకిలీ పత్రాలతో మహిళకు బెదిరింపులు
- ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణిధర్

ఆదిలాబాద్‌రూరల్: భూ కబ్జాకు యత్నించిన ఆరుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్‌రూరల్ సీఐ కె.ఫణిధర్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనుకుంట గ్రామంలోని సర్వే నంబర్ 7/1లోని ఐదెకరాల 10 గుంటల భూమిని కళావతిబాయి 1979లో గడ్డం యాదవరావు అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసింది. 2020లో తన వదిన గైదాని లతా వామన్‌రావుకు విక్రయించింది. ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు యత్నించారు. బినామీల సహకారంతో నకిలీ పత్రాలు సృష్టించి యాదవరావు వారసుల ద్వారా భూమిని కొనుగోలు చేసినట్లు సేల్ అగ్రిమెంట్ దస్తా వేజులు తయారు చేశారు. బాధితురాలిని స్థలం వదిలిపెట్టి వెళ్లాలని బెదిరించారు. దీంతో బాధితురాలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో 15 మంది ముఠా సభ్యులు ఉండగా, అందులో బుధవారం ఆరుగురు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సయ్యద్ సాజిద్ అలియాస్ సాజిదొద్దిన్, శాంతినగర్‌కు చెందిన వకులాభరణం ఆదినాథ్, షేక్ వాహిద్, బృందావన్ కాలనీకి చెందిన చింతకుంట్ల సురేశ్, శిఘాట్‌కు చెందిన సోంజోకి మోహన్‌లాల్, బొక్కల్‌గూడకు చెందిన సయ్యద్ యాహియాలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా మహమ్మద్ ముజాహిద్, పత్తి ముజ్జు, షేక్ అబిద్ షేక్ నూర్, పార్వతీబాయి గడ్డంవర్, గడ్డం ప్రశాంత్, తనూజ నందకుమార్ దేశ్ పాండే, శోభా వినాయక్ కులకర్ణి, గడ్డంవర్ రామారావు, లలితా సుభాష్ లాంబే, దేశ్ పాండే సునీతలు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. భూ కబ్జాలకు యత్నించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన నికోడే నరేశ్ అనే యువకుడికి అత్యాచారం కేసులో పదేళ్ల జైలుశిక్ష, రూ. 40 వేల జరిమానా జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీ రమేశ్ విధించినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ బుధవారం తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం.. గురుడుపేట గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానంటూ నరేశ్ వెంటపడ్డాడు. ఈ క్రమంలో 2017లో చింతలమానెపల్లి మండలానికి చెందిన ఒక వ్యక్తితో యువతికి వివాహం జరిగింది. యువతికి వివాహం జరిగినా నరేశ్ వేధింపుల కారణంగా యువతికి, ఆమె భర్తకు తరుచూ గొడవలు జరిగాయి. సెప్టెంబర్ 25, 2020న రాత్రి సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయటకు వెళ్లిన యువతిపై నరేశ్ అత్యాచారం చేశాడు. పలుమార్లు పంచాయతీ నిర్వహించగా యువతికి భర్తతో విడాకులయ్యాయి. వేధింపులకు గురి చేయడంతో పాటు అత్యాచారం చేసిన నరేశ్‌పై యువతి ఫిర్యాదు చేయడంతో అప్పటి ఏఎస్సై శివాజీ కేసు నమోదు చేశారు. బుధవారం జిల్లాసెషన్స్ కోర్టులో సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో నరేశ్‌కు జడ్జి జైలుశిక్ష ఖరారు చేశారు.

కలెక్టరేట్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



వివరాలు అడిగి తెలుసుకుంటున్న పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన బసండ్ల ముత్యం బుధవారం నిర్మల్ కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం చేశాడు. పెట్రోల్ డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసుకుని తనకు న్యాయం చేయాలని కోరాడు. గమనించిన కార్యాలయ సిబ్బంది అతడి నుంచి పెట్రోల్ బాటిల్ స్వాధీనం చేసుకుని పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ అతడిని స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించారు. ముత్యం మాట్లాడుతూ గ్రామంలోని తన సొంత భూమిని వేరొకరు కబ్జా చేశారని ఆరోపించాడు. కబ్జాదారుడు మూడు రోజుల నుంచి తనను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఏం చేయాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎవరిని ఆశ్రయించాలో తెలియక ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిపాడు.

బౌలర్లదే జోరు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్ 19 క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తుండగా బుధవారం జరిగిన పోటీల్లో బౌలర్లదే హవా కొనసాగింది. రెడ్, బ్లూ జట్ల మధ్య 50 ఓవర్ల మ్యాచ్ జరగ్గా, బ్లూ జట్టు ముందుగా బ్యాటింగ్ చేసి 39.5 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయ్యింది. రెడ్ జట్టు బౌలర్లు అద్భుతంగా రాణించగా, డి.లక్ష్మణ్ 4 కీలక వికెట్లు సాధించాడు. అనంతరం లక్ష్య ఛేదనలో రెడ్‌జట్టు 4 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. శ్రీరామ్ 53 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడని కోచ్ ప్రదీప్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ MNC కంపెని ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. అర్హత 10th – డిగ్రీ జీతం 20 వేలు నుంచి. Ph: 99084 29239 [SCA 25004985]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462